క్లుప్తంగా

అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కార్వేటినగరం వాసి ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కిషోర్‌కుమార్ కుటుంబసభ్యులు శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు.

12 నుంచి నిరవధిక సమ్మె

నగరి: ఈనెల 12వ తేదీ మంగళవారం నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) పుత్తూరు సబ్‌డివిజన్ నేతలు తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ 7వ వేతన కమిటీ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి ఉద్యోగులకు న్యాయపరంగా అందాల్సిన ఫలాలను ఇవ్వలేదన్నారు. తపాలా శాఖా ఉన్నతాధికారులు చర్చలతో కాలయాపన చేశారే తప్ప చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. పలు దఫాలు ఉద్యోగ సంఘాలు తపాలా అధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో నిరవధిక సమ్మెకు దిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెలో పాల్గొని చట్టపరమైన కోరికలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. సివిల్ సర్వెంట్ హోదా, 8 గంటల పనిభారం, అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు, 180 రోజులకు ఎర్న్ లీవ్, కమలేష్ కమిటీ సిఫారసులో ఇప్పటి వరకు అమలు చేయని హామీల సాధన కోసం చేస్తున్న సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐజీడీఎస్‌యూ నేతలు నాగయ్య, మురళి. బాబునాయుడు, యుగంధర్, వెంకటరమణ, వెంకట్రావు పిలుపునిచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష చేస్తున్న పోలీసులు

పాలసముద్రం: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శనివారం బలిజకండ్రిగ, షోలింగర్–పళ్లిపట్టు జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణరావ్ పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం దారుణం

తిరుపతి సిటీ: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎస్వీయూలో ఔట్‌సోర్సింగ్ మ్యాన్ పవర్ నియామకాలు చేపట్టామని శ్రీనివాస డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ఎండీ కె.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్కాగా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని అమలు పరిచామన్నారు. వర్సిటీలో కొందరు వ్యక్తులు తమ సంస్థపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. వర్సిటీ వీసీకి తప్పుడు సమాచారంతో వినతిపత్రం సమర్పించి, ఉద్యోగులలో అయోమయం నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నెలకు రూ.10,250 వేతనం చెల్లిస్తున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లిస్తున్నామని తెలిపారు. సోమవారం అన్ని విషయాలను ఆధారాలతో సహా వీసీకి, వర్సిటీ అధికారులకు విన్నవించి, అవాస్తవాలు ప్రచారం చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. సంస్థ పేరు ప్రతిష్టలకు భంగం కలిగే విధంగా వ్యవహరించిన వారిపై పరువునష్టం దావా వేయనున్నట్లు తెలియజేశారు.

నగరి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్


అత్యాధునిక ప్రసవ వార్డు


పేషంట్లకు అత్యాధునిక బెడ్లు


నాడు దైన్యం..నేడు ధైర్యం

ఆపద వస్తే జిల్లా కేంద్రాలకు పరుగులు తీయకుండా పట్టణంలోనే నాణ్యమైన, ఆధునిక వైద్యం అందేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా నిధులు విడుదల చేసి ఏరియా ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయికి దీటుగా తీసుకెళ్లింది. దీంతో కార్పొరేట్ ఆస్పత్రిలో మాత్రమే లభించే వైద్యసేవలు సాధారణ ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే లభిస్తున్నాయి.


నగరి ఏరియా ఆస్పత్రి

- అందుబాటులో ఆధునిక వైద్యం
- నాడు–నేడుతో ప్రభుత్వ ఆస్పత్రులకు మహర్దశ
- వసతులతోపాటు, అత్యాధునిక పరికరాలు వైద్యసేవలు
- ఆస్పత్రిలోనే ఆక్సిజన్ ప్లాంటు, స్టెమీ యూనిట్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మొత్తం మంది వైద్యులు	:	20 మంది
వార్డులు	:	8
బెడ్‌లు	:	100
అత్యాధునిక ల్యాబ్	:	1
రోజుకు వైద్యం అందుకుంటున్న వారు	:	600

నగరి: గతంలో ప్రభుత్వ వైద్యశాలల పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తి సామాన్య ప్రజలు ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్ల సంగతి దేవుడెరుగు పగటి వేళల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉండేవారు కాదు. మందులు, పరికరాల కొరత ఉండేది. ఆస్పత్రికి వెళ్లడానికి మార్గాలు కూడా సక్రమంగా ఉండేది కాదు. అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉండేవి కావు. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్యం అందుతోంది. నాడు దైన్యంగా ఉన్న వైద్యసేవలు నేడు ప్రజలకు ధైర్యాన్ని ఇస్తున్నాయి.

రూ. 5 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో ఆధునికీకరణ పనులు

- ఆస్పత్రిలో పగిలిన ఫ్లోరింగ్‌లు, సీలింగ్‌లు సరిచేసి అదనపు గదులు
- ఆస్పత్రిలో రెండు ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు
- అత్యాధునిక ప్రసవగది, ఎక్స్‌రేగది, డెంటల్ చైర్, ఎలక్ట్రిక్ ప్యానల్స్ ఏర్పాటు. వార్డులకు అత్యాధునిక బెడ్లను అమర్చారు.
- అన్నిరకాల పరీక్షలు నిర్వహించే కంప్యూటరైజ్డ్ ల్యాబ్
- గుండెపోటు సమయాల్లో రక్షణకు స్టెమీ యూనిట్
- 160 కిలోవాట్స్ సామర్థ్యం గల జనరేటర్
- ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి ముఖద్వారం వరకు రోడ్డు, విద్యుద్దీపాలు
- డయాలసిస్ వార్డు మంజూరు, డ్రైనేజీ సిస్టంను సరిచేశారు.
- గర్భిణులకు ప్రతి బుధవారం మంత్రి ఆర్కే రోజా పౌష్టికాహారం అందజేత

జగనన్న ప్రభుత్వం ప్రాణం పోసింది



ఈ ఏడాది నవంబర్ 1న నాకు ఛాతిలో నొప్పి వచ్చి అపస్మారక స్థితికి వెళ్లాను. బంధువులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బంధువులు నమ్మకాన్ని కోల్పోయే స్థితికి కూడా చేరుకున్నారు. ఆ దశలో వైద్యులు కార్తికేయన్ స్టెమీ యూనిట్‌లో నాకు ఉచితంగా ఇంజక్షన్ వేశారు. తరువాత తెలిసింది ఇంజక్షన్ విలువ రూ.70 వేలని. నగరి ఏరియా ఆస్పత్రిలో వేసిన ఇంజక్షనే నా ప్రాణాలు కాపాడిందని. అలాంటి యూనిట్ నగరిలో పెట్టిన ప్రభుత్వానికి పెట్టించిన మంత్రి రోజమ్మకు కృతజ్ఞతలు.

– ఎస్ఎం. అయ్యప్పన్, ఏకాంబరకుప్పం, నగరి మున్సిపాలిటీ

అత్యాధునిక వైద్యసేవలు వినియోగించుకోవాలి



అత్యాధునిక వైద్యసేవలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. జనరల్ వైద్యంతో పాటు చర్మ, దంత, గైనకాలజీ, పీడియాట్రిస్టు, కంటివైద్య నిపుణులు, జనరల్ సర్జన్, పేతాలజిస్ట్, ఈఎన్‌టీ, అనస్థీసియన్ వైద్య నిపుణులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నారు. వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ ప్రభావతి, మెడికల్ సూపరింటెండెంట్, నగరి ఏరియా ఆస్పత్రి

లోక్ అదాలత్‌లో 564 కేసుల పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న జడ్జి విష్ణువర్మ

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 564 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ మనీ కేసులు 3, సివిల్ టైటిల్ 3, ఐపీసీ కేసులు 14, ఎంసీ కేసులు 03, డీఈసీ ఒకటి, ఎస్‌టీసీ 1, సీసీ 498ఏ కేసులు 7, ఎన్ఐ యాక్ట్ 4, ఎస్ఈబీ 18, బ్యాంకు కేసులు 48, సెకండ్ క్లాస్ కేసులు 294, అడ్మిషన్ కేసులు 6 పరిష్కారమయ్యాయి. రూ.1.39 కోట్లు రికవరీ అయ్యింది. ఏపీపీ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి


మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐకేపీ ఏపీఎం పరిదుమస్తాన్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు బాల్య వివాహాలు, గృహహింస అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ లింగవివక్ష నేరమని, బాల్యవివాహాలు చేయరాదని సూచించారు. ప్రతి మహిళా విద్యావేత్తగా ఎదగాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి మహిళ వద్ద ప్రతిజ్ఞ చేయించారు. రక్తహీనతను వివరించారు. అనంతరం డ్వాక్రా మహిళలు మానవహారం నిర్వహించారు. సీసీ లోకనాథం, సంఘమిత్ర మురగయ్య పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో జెడ్పీ చైర్మన్


జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

జ్వరం, జలుబుతో ఓపీ కిటకిట


క్యూ కట్టిన జ్వర బాధితులు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జ్వరం, జలుబు, దగ్గు బాధితులతో ఓపీ కిటకిటలాడింది. ఈ రకమైన సమస్యలకు సంబంధించి 150కి బాధితులు వచ్చారు. దీంతో ఆస్పత్రి ఆవరణ మధ్యాహ్నం 12 గంటల వరకు రద్దీగా కనిపించింది. వైద్యులు చికిత్స చేసి తగిన సూచనలు, సలహాలు అందించారు. వైరల్ ఫీవర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు.

బాధితులకు అండగా ప్రభుత్వం


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

- నిత్యావసర వస్తువుల పంపిణీ
- ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం.
- కిలో కందిపప్పు, ఎర్రగడ్డ, ఉర్లగడ్డ, లీటరు నూనె
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి


హాజరైన బాధితులు

పుత్తూరు: మిచాంగ్ తుపాన్ బాధితులకు నేటి జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పుత్తూరు పట్టణ, రూరల్ పరిధిలోని 234 తుపాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో వంతున కందిపప్పు, ఎర్రగడ్డ, ఉర్లగడ్డ, లీటరు నూనె అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తుపాన్ బాధితులకు సాయం అందించారన్నారు. వర్ష బీభత్సానికి దెబ్బతిన్న రోడ్లు, కాల్వలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. తక్షణ సాయంగా రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వర్ష బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేసినట్లు చెప్పారు. దెబ్బతిన్న ఇళ్లు, పంటలను అధికారులు నష్టం అంచనా వేస్తున్నారని, అందరిని అన్ని విధాల ఆదుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దార్ జె.పరమేశ్వర స్వామి, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంఎల్‌ఓ దిలీప్, కౌన్సిలర్లు హేమలత, జయలక్ష్మి, బాలాజి, చిట్టిబాబు, జాన్ కెనడీ, గుణ, నేతలు శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, గోపి, చిన్నా, ఈశ్వరయ్య యాదవ్, మునిరత్నం, గాంధీ, చక్రి, వేలాయుధం, జయకుమార్, రాంబత్తయ్య పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


పాలసముద్రం: డ్రోన్‌తో పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎస్ విద్యావతి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శనివారం బలిజకండ్రిగ, తొట్టికండ్రిగ పంచాయతీల్లో సర్పంచ్‌లు భానుప్రియ, జయలక్ష్మి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డ్రోన్ ద్వారా రైతులు సాగు చేసిన పంటలకు మందులు పిచికారీపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్, ఏపీఓ మార్గరెట్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నగరి నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ సుబ్రమణ్యంరాజు సూచించారు. శనివారం వడమాలపేట మండలం పాదిరేడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం రైతులకు డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ భానుమూర్తి, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, బీజేపీ నేతలు జగదీష్, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పుత్తూరులో 701 కేసుల పరిష్కారం

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 701 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.1,41,19,765 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 654 క్రిమినల్ కేసులు, 31 సివిల్, 16 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా న్యాయమూర్తులు ఎస్‌సీ.రాఘవేంద్ర, సి.జానకి, వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. న్యాయవాదులు ఎం.విజయకుమార్, ఎస్.లక్ష్మీపతి, పి.దొరబాబు బెంచ్ మెంబర్స్‌గా వ్యవహరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.


పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర


కేసుల పరిష్కారం కోసం వేచి ఉన్న కక్షిదారులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

చిత్తూరు రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరం రెవెన్యూ భవనంలో శనివారం ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టం అనే కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న భార్గవ్‌రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కాళ్లు చేతులు కదపకుండా 5 గంటల పాటు నీటిలో తేలియాడి గిన్నిస్ రికార్డుకెక్కిన వైషాక్, రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమలను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్, సంస్థ అధ్యక్షుడు రాజరత్నంరెడ్డి, దాత పార్థసారథినాయుడు పాల్గొన్నారు.


భార్గవరెడ్డిని సన్మానిస్తున్న డీఈఓ

సోషల్ మీడియా మీటప్ విజయవంతం

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని రోబో డైనర్‌లో శనివారం రాయలసీమ సోషల్ మీడియా మీటప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాలోని వివిధ పేజీ అడ్మిన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ సర్వర్స్ అధినేత, ఎథికల్ హ్యాకింగ్ నిపుణుడు సతీష్ వివిధ మోసాలు, హ్యాకింగ్ వంటి అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. సతీష్‌తోపాటు బ్యూటీఫుల్ తిరుపతి శశి, వెదర్ మ్యాన్ సాయి ప్రణీత్ వారి ప్రాంతాల్లో విశిష్టతను తెలియజేశారు. సంపాదన కోసం చెడు మార్గాలలో వెళ్లకుండా, మోసపోకుండా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని, ఊహ తెలియని చిన్నారులకు సెల్‌ఫోన్లు ఇవ్వడం చేయకూడదని తెలిపారు.


సెల్ఫీ దిగుతున్న రాయలసీమ సోషల్ మీడియా అడ్మిన్లు

పార్వేట మండపంలో ఘనంగా కార్తీక వనభోజనాలు


విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు


భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది


స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

చంద్రగిరి: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శనివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది. కార్తీక వనభోజనం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ ప్రత్యేక అధికారి, టీటీడీ పీఆర్‌ఓ డాక్టర్ టి.రవి, వీజీఓ బాలిరెడ్డి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్‌రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.